పేరుకే సర్పంచ్

- నిధులు లేక నైరాశ్యం
- మొక్కుబడిగా అధికారాలు
- వలంటీర్ల కంటే దారుణమంటున్న కొందరు సర్పంచులు
- ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత
- భవిష్యత్ కార్యాచరణపై రేపు విజయవాడలో సమావేశం



(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

● విజయనగరం సమీప గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆయనకు బీమా ఉంది. బాధిత కుటుంబానికి సాయం అందాలంటే ఇవ్వాల్సిన ధ్రువీకరణపత్రంపై వలంటీరు, సచివాలయ సంక్షేమాధికారి, గ్రామంలోని ఇద్దరు పెద్దల సంతకాలు అవసరం. సర్పంచ్ గురించి అందులో ప్రస్తావించలేదు.

● గంట్యాడ మండలంలోని ఓ గ్రామంలో వృద్ధాప్య పింఛను కోసం ఓ వ్యక్తి సచివాలయానికి వెళ్లి వెల్ఫేర్ అసిస్టెంట్‌కు దరఖాస్తు ఇచ్చాడు. వివిధ ధ్రువీకరణ పత్రాలను అందజేస్తూ తన ఇబ్బందులను వివరించాడు. అవసరం లేకపోవడంతో పక్క గదిలో ఉన్న సర్పంచ్‌ను కలవలేదు.

● బొబ్బిలి మండలంలోని ఓ గ్రామంలో పరసరాలు అధ్వానంగా తయారయ్యాయి. రోడ్లు కూడా బాగాలేదు. దీనిపై స్థానికులు ఇటీవల సచివాలయానికి వెళ్లి పరిస్థితిని కార్యదర్శికి వివరించారు. సర్పంచ్‌ను సంప్రదించలేదు.

ఈ విధంగా గ్రామాల్లో సర్పంచులు నామమాత్రమయ్యారు. ప్రజలకు ఏ పథకం మంజూరు చేయాలన్నా.. సాయం అందాలన్నా వారి ప్రమేయం ఉండడం లేదు. అభివృద్ధి చేద్దామంటే నిధులు లేవు. ఆఖరుకు గ్రామాల్లో వీధిలైట్లు వేయలేకపోతున్నారు. పారిశుధ్య పనులు చేపట్టలేకపోతున్నారు. సర్పంచ్ ఎన్నికల్లో అనేక హామీలిచ్చారు. పెద్ద హామీల సంగతి అటుంచితే మౌలిక సదుపాయాలు కల్పించలేక పోతున్నామన్న బాధ వారిని వెంటాడుతోంది. 14వ ఆర్థిక సంఘం రెండు విడతల నిధులు, 15వ ఆర్థిక సంఘం మొదటి విడత నిధులను ప్రభుత్వం వెనక్కు తీసుకుంది. దీంతో పంచాయతీల ఖాతాలు ఒట్టిపోయాయి. కొందరు సర్పంచులు నేరుగా ఢిల్లీ వెళ్లి కేంద్ర పంచాయతీరాజ్ మంత్రికి ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. ఈ పరిస్థితిలో సర్పంచులు పోరాటానికి సన్నద్ధం అవుతున్నారు. కొత్త ఏడాదిలో రెండో దశ నిరసన శంఖారావానికి సన్నద్ధం అవుతున్నారు. దీనిపై నిర్ణయం తీసుకునేందుకు ఈ నెల 3న పంచాయతీ చాంబర్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజాప్రతినిధులు సమావేశమవుతున్నారు.

నిధులు లేని పాలన

దేశానికి గ్రామాలే పట్టుగొమ్మలని.. గ్రామాభివృద్ధి ద్వారానే స్వరాజ్యం వచ్చినట్లు అవుతుందని గాంధీజీ ప్రవచించారు. ఇదే లక్ష్యంతో స్థానిక సంస్థల బలోపేతానికి గత ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయి. గ్రామ పంచాయతీ ప్రథమ పౌరుడైన సర్పంచికి నిధులు, విధులు, అధికారాలను రాజ్యాంగం కట్టబెట్టింది. దానినే ప్రభుత్వాలు అనుసరించాయి. అనేక ఫలితాలు సాధించాయి. సామాజికంగా కొత్త మార్పులను, సంస్కరణలను తీసుకొచ్చాయి. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం సర్పంచులు, ఎంపీటీలు, జిల్లా ప్రాదేశిక సభ్యులకు ఎటువంటి నిధులు అందించడం లేదు. జడ్పీ, మండల సమావేశాల్లో సమస్యల ప్రస్తావనకే వారి పాత్ర పరిమితమవుతోంది. సర్పంచి విషయంలో మరింత దారుణమైన పరిస్థితి. వలంటీర్ కంటే హీనంగా చూస్తున్నారని పేరు చెప్పడానికి ఇష్టపడని కొందరు అధికార పార్టీ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. పథకాలు కావాలంటే వలంటీర్‌ను బతిమాలాడాల్సిన పరిస్థితిని వైసీపీ తీసుకు వచ్చింది. నిరాశతో ఉన్న సర్పంచులు పోరాటానికి సన్నద్ధం అవుతున్నారు. ఈ నెల3న ఓ నిర్ణయానికి రానున్నారు.

పరిస్థితి ఘోరం

గ్రామాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారు. నిధులు లేవు.. అధికారాలు లేవు.. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన, 14, 15వ ఆర్థిక సంఘం నిధులతో కొంతైనా అభివృద్ధి చేద్దామని సర్పంచ్‌లు ప్రణాళిక సిద్ధం చేసుకోగా ఆ నిధులను వేరే పథకాలకు ప్రభుత్వం దారి మళ్లించింది. విద్యుత్ బిల్లులు కూడా బకాయిలు ఉన్నాయి.

- వానపల్లి లక్ష్మీముత్యాలరావు, ఏపీ పంచాయతీ చాంబర్ ప్రతినిధి

సమస్యలు యథాతథం

గ్రామాల్లో సమస్యలు యథాతథంగా ఉన్నాయి. అభివృద్ధి చేయలేకపోతున్నాం. ప్రజలకు సమాధానం చెప్పలేని నిస్సాహాయస్థితిలో ఉండిపోతున్నాం. పంచాయతీలకు రావాల్సిన నిధులు కూడా దారి మళ్లించి ఈ ప్రభుత్వం అన్యాయం చేసింది. కొన్ని గ్రామాల్లో లైట్లు వెలగక చీకట్లు కమ్ముకున్నాయి. చిన్న పనులు కూడా చేయలేకపోతున్నాం. ఇక ఉద్యమమే శరణ్యం.

- కర్రోతు సత్యనారాయణ, సర్పంచ్, పోలిపల్లి, భోగాపురం



కలెక్టర్ నాగలక్ష్మికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న జేసీ మయూర్‌అశోక్

కొత్త కళ

- జిల్లా అంతటా నూతన సంవత్సర వేడుకలు
- ఆలయాల్లో పూజలు

విజయనగరం(ఆంధ్రజ్యోతి), జనవరి 1: కొత్త ఏడాదికి జిల్లా ప్రజలు సాదర స్వాగతం పలికారు. స్నేహితులు, బంధువులు, గురువులు, నేతలకు శుభాకాంక్షలు తెలియజేశారు. పెద్దల ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఆలయాల్లో పూజలు చేశారు. మహిళలు ముంగిళ్లను రంగురంగుల రంగవల్లులతో అందంగా ముస్తాబు చేశారు. 2024కు గ్రాండ్ వెల్‌కమ్ చెప్పారు. ఇక రాజకీయ నేతల ఇళ్ల వద్ద సందడే సందడి కనిపించింది. చిన్న నాయకులు కూడా కేక్‌లు కట్ చేస్తూ టిఫిన్లు, భోజనాలు ఏర్పాటు చేశారు. డీజే బాక్సుల్లో పార్టీల పాటలకు కార్యకర్తలు, అభిమానులు నృత్యాలు చేశారు. వెరసి నూతన సంవత్సరం తొలిరోజు కొత్త కళ కనిపించింది. డిసెంబరు 31న రాత్రి మందు విక్రయాలు అత్యధికంగా సాగాయి. మందుబాబులు గత ఏడాది కంటే రూ.కోటీ 50 లక్షల మద్యాన్ని అదనంగా తాగేశారు. రాత్రంతా యువత ఎంజాయ్ చేసింది. ఇక సోమవారం ఉదయం కొత్త దుస్తులతో కొంగొత్తగా కనిపించారు. ఆలయాన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పూలు, స్వీట్‌లు, పండ్లు విక్రయాలు బాగా సాగాయి. బొకేలను వినూత్నంగా తయారు చేశారు.

● ఎన్నికల ఏడాది కావడంతో ఆ ప్రత్యేకత స్పష్టంగా కనిపించింది. ఎక్కువ మంది నాయకులు, కార్యకర్తలు తమ అభిమాన నాయకుడి ఇళ్లకు క్యూ కట్టారు. నేతలను ఎప్పుడూ కలవని వారు కూడా ఎందుకైనా మంచిది ఎన్నికలకు ముందే ఓసారి ప్రసన్నం చేసుకుందామని పయన మయ్యారు. మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు ఇళ్ల వద్ద కోలాహలం నెలకొంది. నియోజకవర్గ నాయకులు, మండల నాయకుల గృహాల వద్ద కూడా సందడి కనిపించింది.

● **కలెక్టరేట్:** కలెక్టరేట్‌లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. కలెక్టర్ నాగలక్ష్మికి సోమవారం ఉదయం అనేక మంది అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. జేసీ మయూర్‌అశోక్, ట్రైనీ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, డీఆర్‌వో ఎస్‌డీ అనిత, మున్సిపల్ కమిషనర్ రెడ్డి శ్రీరాములు నాయుడు, ఇతర అధికారులు కలిశారు. అంతకుముందు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపికాపాటిల్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



జగన్ సోది చెబుతున్నారు

- అంగన్వాడీల వినూత్న నిరసన

విజయనగరం(ఆంధ్రజ్యోతి), జనవరి 1: అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు, డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ 21 రోజుల నుంచి సమ్మె చేస్తుంటే ముఖ్యమంత్రి సోది చెబుతున్నారంటూ అంగన్వాడీలు ఎద్దేవా చేశారు. సీఐటీయూ మద్దతుతో తాజాగా సోమవారం కలెక్టరేట్ వద్ద వినూత్న నిరసనకు దిగారు. సమస్యలు, హామీలు పరిష్కరించాలని కోరితే పరిష్కరించకుండా జగన్, మంత్రులు చెప్పిందే పలుమార్లు చెబుతూ సోది మాట్లాడుతున్నారని నాయకులను అనుకరించారు. శిబిరంలో కూర్చొని సోది చెప్పుకున్నారు. ఈ ప్రదర్శన అందరినీ ఆలోచింపజేసింది. జిల్లా యూనియన్ నాయకురాలు బి.పైడిరాజు మాట్లాడుతూ 21 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు అయినా లేకపోవటం దురదృష్టకరమన్నారు. సీఎం జగన్‌కు వ్యతిరేకంగా పాటలు పాడి డ్యాన్స్‌లు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జగన్మోహన్, సుశీల, ఉష తదితరులు పాల్గొన్నారు.

ఈ కలయిక ఎటువైపో!

- అశోక్‌గజపతిరాజును కలిసిన అవనాపు విజయ్
- వైసీపీ నాయకులూ రాక
- పార్టీ మారడం ఖాయమంటున్న పరిశీలకులు
- తగిన గుర్తింపు లేకపోవడమే కారణమా?



అశోక్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అవనాపు విజయ్

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

విజయనగరం నియోజకవర్గ వైసీపీలో మరో కుదుపునకు సంకేతాలు వస్తున్నాయి. ఎప్పటినుంచో ఆ పార్టీ నాయకుల్లో అంతర్గతంగా ఉన్న వ్యతిరేకత టీడీపీ వేదికగా బహిర్గతం కానుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. త్వరలోనే భారీ మార్పులు జరగవచ్చునని అంచనా వేస్తున్నారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అశోక్‌గజపతిరాజును వైసీపీ కీలక నాయకుడు అవనాపు విజయ్ కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. కొత్త సంవత్సర శుభాకాంక్షలు చెప్పడానికే వచ్చినట్లు ఆయన చెబుతున్నా ఇదో కీలక పరిణామం అన్న చర్చ ప్రజల్లో నడుస్తోంది.

వైసీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి అవనాపు సోదరులు వెన్నుదన్నుగా ఉంటున్నారు. పార్టీ కార్యక్రమాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. సోదరుల్లో ఒకరైన విజయ్ తాజాగా అశోక్ బంగ్లాకు సోమవారం వెళ్లి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట అనుచరులూ ఉన్నారు. ఈ విషయం తెలిసి వైసీపీలో కలకలం రేగింది. విజయ్ వెంట మాజీ కౌన్సిలర్ గాడు అప్పారావు, పట్టణ వైసీపీలో వివిధ డివిజన్లలో కీలకంగా వ్యవహరిస్తున్న శ్రీను, ప్రసాద్, బాబూరావు, బి.రవి, జొన్నగుడ్డి ప్రాంత వైసీపీలో కీలకంగా వ్యవహరించే మరో నాయకుడు అశోక్‌ను కలిశారు. అయితే తరువాత విజయ్ ఏమీ మాట్లాడ లేదు. కార్యకర్తలతో మాట్లాడాక నిర్ణయం తీసుకోవచ్చునని ఆ పార్టీ కార్యకర్తల నుంచే వినిపిస్తోంది.

వైసీపీ ఆవిర్భావం తర్వాత అవనాపు సూరిబాబు ముందుగా ఆ పార్టీ జెండాను విజయనగరంలో ఎగరేశారు. తరువాత రోజుల్లో కుమారులు విజయ్, విక్రమ్‌లే ఆ బాధ్యతలను కొనసాగిస్తూ వస్తున్నారు. అయితే పార్టీలో తనకు తగిన గుర్తింపు ఇవ్వడం లేదన్న అసంతృప్తి విజయ్‌లో చాలాకాలంగా ఉందని పరిశీలకులు చెబుతున్నారు. ఈ కారణంగానే అశోక్‌ను కలిశారా లేదా నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పేందుకేనా అన్నది త్వరలో స్పష్టం కావొచ్చు. అయితే ప్రత్యేకంగా వచ్చి అశోక్‌కు శుభాకాంక్షలు చెప్పటం రానున్న పరిణామాలకు నాందిగానే చెప్పుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల 14వ డివిజన్లోని వైసీపీ నాయకుడు గదుల వెంకటరమణ టీడీపీలో చేరారు. ఇదే దారిలో మరికొందరు ఉన్నట్లు తెలుస్తోంది.

పది రోజులుగా టెన్షన్

- గ్రూప్-2కు దరఖాస్తు చేసుకోలేకపోతున్న అభ్యర్థులు
- వెంటాడుతున్న సర్వర్ సమస్య
- 10 వరకే గడువు

కలెక్టరేట్, జనవరి 1: గ్రూప్ -2 పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి అభ్యర్థులు తంటాలు పడుతున్నారు. గంటలకొద్దీ నెట్ సెంటర్లోనే గడుపుతున్నారు. అప్పటికీ దరఖాస్తు సెండ్ కావడం లేదు. పదిరోజులుగా ఈ పరిస్థితి నెలకొంది. గంట్యాడకు చెందిన రామారావు నాలుగు రోజులుగా ప్రయత్నిస్తే అతి కష్టంమీద ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అయితే ఫీజు పేమెంట్‌ను మాత్రం ఆన్‌లైన్ తీసుకోవడం లేదు. దీంతో ఇప్పటికీ దరఖాస్తు ప్రక్రియ పూర్తికాలేదు. విజయనగరం పట్టణానికి చెందిన అభ్యర్థి రవి గ్రూప్ -2 పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి మీసేవ, ఇంటర్‌నెట్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నా సర్వర్ సమస్య వల్ల ఆన్‌లైన్ చేసుకోలేకపోతున్నాడు. ప్రతిరోజూ ఇదే సమస్య వెంటాడుతోంది. అసలు గ్రూప్-2కి దరఖాస్తు చేసుకోగలమా? లేదా? అని టెన్షన్ పడుతున్నారు.

నిరుద్యోగులను ఊరిస్తూ ఎట్టకేలకు గత నెల 7న ప్రభుత్వం గ్రూపు-2 నోటిఫికేషన్ విడుదల చేసింది. వివిధ శాఖలకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో 899 పోస్టులను భర్తీ చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో వెల్లడించారు. అభ్యర్థులు గత నెల 21 నుంచి ఈనెల 10వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవాలని అందులో పొందుపరిచారు. అయితే సర్వర్ సమస్యతో మీసేవ, ఇంటర్‌నెట్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నారు. పదిరోజులు దాటినా పరిష్కారం కాలేదు. గతంలో ఏపీపీఎస్సీలో రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు ఓటీపీఆర్, పాస్‌వర్డ్‌లు ఉంటాయి. ఇప్పుడు గ్రూపు-2కి దరఖాస్తు చేసే సమయంలో వాటిని ఎంటర్ చేస్తే ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఓపెన్ కావాలి. కావడం లేదు. అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారు. 9 రోజులు మాత్రమే గడువుంది.

నూతనోత్సాహం

- వాడవాడలా నూతన సంవత్సర వేడుకలు
- పండగలా చేసుకున్న తెలుగు తమ్ముళ్లు
- టీడీపీ కార్యాలయాల వద్ద సందడి



బొబ్బిలిలో కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి సుజయ్ కృష్ణ, బేబీనాయన, టీడీపీ నాయకులు

నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సోమవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని టీడీపీ కార్యాలయాలు అభిమానులు, కార్యకర్తలతో పోటెత్తాయి. టీడీపీ నాయకులను ఆ ప్రాంత కార్యకర్తలు, నాయకులు శుభాకాంక్షలతో ముంచెత్తారు. అశోక్‌గజపతిరాజుకు జిల్లా వ్యాప్తంగా నాయకులు, కేడర్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. జనసేన నాయకులు కూడా కలిసి బొకేలు అందించారు. బొబ్బిలి కోటలో వేడుకలు మిన్నంటాయి. అభిమానులు చిందులేస్తూ నాయకులను ఉత్సాహపరిచారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీకి పోలీసు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. ఎల్‌కోట, రాజాం, రేగిడి, నెల్లిమర్ల, భోగాపురం, గజపతినగరం, భోగాపురంలో టీడీపీ నాయకులు, జనసేన నాయకులు కలిసి వేడుకలు నిర్వహించారు.

- ఆంధ్రజ్యోతి బృందం



అశోక్ గజపతిరాజు దంపతులకు శుభాకాంక్షలు చెప్తున్న జనసేన నాయకులు



భోగాపురంలో నాగమాధవికి శుభాకాంక్షలు



ఎల్‌కోట: కోళ్ల దంపతులకు గజమాలతో సత్కారం



రాజాం: కళా వెంకటరావుకు గజమాలతో సత్కారం



ఎస్పీ దీపికకు శుభాకాంక్షలు చెప్తున్న పోలీసులు



బొబ్బిలికోటలో టీడీపీ కార్యకర్తల కోలాహలం



నెల్లిమర్లలో..



రాజాం: కోండ్రుకు శుభాకాంక్షలు



రేగిడిలో వేడుకలు



గజపతినగరం: వేడుకల్లో కేఏ నాయుడు



భోగాపురం: బంగార్రాజుకు శుభాకాంక్షలు

శ్రీరాముని అక్షింతలు పంపిణీ

రాజాం రూరల్: పట్టణంలోని తెలగవీధిలో అయోధ్య శ్రీరాముని పూజిత పవిత్ర అక్షింతల పంపిణీని సోమవారం ప్రారంభించారు. తొలుత రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీరాముని చిత్రపటంతో ర్యాలీ నిర్వహించారు. మునిసిపాలిటీ పరిధిలోని 24 వార్డులతో పాటు నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో ప్రతి గడపకూ ఈనెల ఐదోతేదీలోగా పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు శెట్టి శ్రీనివాసరావు తెలిపారు.

దివ్యాంగులకు దుస్తుల పంపిణీ

రాజాం: రాజాం భవితా కేంద్రంలోని దివ్యాంగులకు పారి శ్రామికవేత్త కొత్తా అనంతరావు సోమవారం దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో కొత్తా చంద్రవతి, జ్యోతి, కొత్తా సౌందర్య, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్, ఐఈఆర్టీలు సాసుబిల్లి హరిబాబు, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు బొబ్బిలిలో తాగునీటి సరఫరా బంద్

బొబ్బిలి: పట్టణంలో మంగళవారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ సత్తారు శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్ జంక్షన్‌లో ప్రధాన పైపులైను మరమ్మతుల కోసం తాగునీటి సరఫరాను నిలిపి వేయనున్నట్టు తెలిపారు.

రామతీర్థానికి పోటెత్తిన భక్తజనం

నెల్లిమర్ల: నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని రామతీర్థం దేవస్థానానికి భక్తులు సోమవారం పోటెత్తారు. ఉదయాన్నే ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి, సీతారాములను దర్శించుకున్నారు. అలాగే పక్కనే ఉన్న ఉమాసదాశివస్వామి ఆలయాన్ని కూడా దర్శించుకున్నారు. మధ్యాహ్నం 2 గంటల వరకు ఆలయం వద్ద భక్తుల తాకిడి కనిపించింది.

భారీ అన్నదానం

శృంగవరపుకోట రూరల్: ధర్మవరం అప్పర్‌రూం చర్చిలో కొత్త సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం పాస్టర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామ యువత, న్యాయవాది శేఖర్, డోల కేశవ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ఉన్నత చదువులకు పునాది పదో తరగతే

కొత్తవలస: ఉన్నత చదువులు చదవడానికి పునాది పదో తరగతేనని...ఈ పరీక్షలలో మంచి మార్కులు సాధించుకునేందుకు మార్గం చూపించే ఉపాధ్యాయులు కొత్తవలస మండలంలోనే ఉండడం విశేషమని జడ్పీటీసీ నెక్కల శ్రీదేవి అన్నారు. యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘంలోని నిష్ణాతులైన ఉపాధ్యాయులు తయారు చేసిన మోడల్ పేపర్స్‌ను ఆమె సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పించేది తల్లిదండ్రుల తరువాత ఉపాధ్యాయులేనన్నారు. పదో తరగతి పరీక్షలలో కొత్తవలస మండలంలోని విద్యార్థులు జిల్లాలో అత్యధిక మార్కులు సాధించేవిధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బండారు శ్రీనివాసరావు, యూటీఎఫ్ ప్రతినిధులు సీహెచ్ నిర్మలా దేవి, జి.విజయ గౌరి, జి.వెంకటనాయుడు, ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ తదితరులు పాల్గొన్నారు.

5 వరకు కోర్టు విధులకు దూరం

కొత్తవలస: ఏపీల్యాండ్ టైటిలింగ్ యాక్టుకు వ్యతిరేకంగా న్యాయవాదుల కోర్టుల విధుల బహిష్కరణ 5వ తేదీ వరకు కొనసాగుతుందని కొత్తవలస న్యాయవాద సంఘ ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ గిరిబాబు తెలిపారు. రాష్ట్ర న్యాయవాదుల సంఘంజేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఈ చట్టంతో సన్నకారు, చిన్నకారు రైతులు నష్టపోవడమే గాక న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించే అవకాశం లేదన్నారు. ఈ చట్టంతో జరిగే నష్టాల విషయమై ఇప్పటికే కోర్టును ఆశ్రయించినట్టు తెలిపారు. త్వరలోనే అనుకూలమైన తీర్పు వస్తుందని రాష్ట్రంలోని అన్ని న్యాయవాద సంఘాలు ఆశగా చూస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో 5వ తేదీ వరకు కోర్టు విధులకు దూరంగా ఉంటామని తెలిపారు.

బస్సుపై రాళ్లతో దాడి

రాజాం రూరల్: రాజాం నుంచి సాలూరు వెళ్తున్న ఒడిశా ఆర్టీసీ బస్సుపై ఆది వారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేశారు. దీంతో బస్సు అద్దాలు పగిలిపోయాయని ఒడిశా ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఖగేశ్వర మహంతో సోమవారం రాజాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రవికిరణ్ కేసు నమోదు చేశారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

విజయనగరం రూరల్, జనవరి 1: కొత్త సంవత్సరం తమకు కలసి రావాలని, కష్టాలు లేకుండా చూడాలంటూ ప్రజలు ఆలయాల్లో పూజలు చేశారు. దీంతో సోమవారం అన్ని ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి. ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పైడిమాంబ వనం, చదురుగుడుల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కన్యకా పరమేశ్వరి, జ్ఞాన సరస్వతి ఆలయం, పాత బస్టాండ్ వద్ద ఉన్న దుర్గాదేవి, సాయిబాబా ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. మండపం వీధిలోని సంపత్ వినాయక స్వామి ఆలయంలో జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, సిరి సహస్ర తదితరులు పూజలు చేశారు. దేవస్థానం ఆధ్వర్యంలో రూపొందించిన 2024 క్యాలెండర్‌ను జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. సిటీ బస్టాండ్ వద్ద ఉన్న సిద్ధి, బుద్ధి వినాయక తదితర ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు.



వివిధ రకాల పువ్వులతో పైడిమాంబకు అలంకరణ

సాహిత్యంతో చైతన్యం

- 'మధురవాణి' పుస్తకావిష్కరణ

విజయనగరం రింగురోడ్డు, జనవరి 1: సాహిత్యంతో చైతన్యం సాధ్యమవుతుందని వాజీ ఛానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం భగవాన్‌నగర్‌లోని ఆయన స్వగృహంలో తెలుగుభాషా పరిరక్షణ సమితి ఆధర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రచయిత డోకి చంద్రశేఖర్ రాసిన 'మధురవాణి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి పుస్తకాలు నేస్తాల వంటివని అన్నారు. వ్యక్తిత్వాన్ని మెరుగుపరిచేందుకు పుస్తకాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్, రచయిత చంద్రశేఖర్ దంపతులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వాజీ చానల్ ఎండీ శ్రీనివాసరావు

బొల్లినేని మెడ్‌స్కిల్స్‌లో బీఎస్సీ పారా మెడికల్ నూతన కోర్సులు

శ్రీకాకుళం రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): బొల్లినేని మెడ్‌స్కిల్స్ (జెమ్స్)లో నూతనంగా నాలుగు బీఎస్సీ పారా మెడికల్ కోర్సులు ప్రారంభిస్తున్నామని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు అన్నారు. సోమవారం కళాశాల ఎనిమిదో వార్షికోత్సవం సందర్భంగా తొలుత సిబ్బంది, విద్యార్థుల సమక్షంలో కేక్‌ను కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తమ కళాశాలలో మాత్రమే ఈ కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. బీఎస్సీ ట్రాన్స్ఫ్యూషన్ టెక్నాలజీ కోర్సులో ఐదు సీట్లు, రేడియో థెరపీ టెక్నాలజీ కోర్సులో రెండు సీట్లు, ఫిజీషియన్ అసిస్టెంట్ టెక్నాలజీ కోర్సులో 15 సీట్లు, మెడికల్ రికార్డ్సు టెక్నాలజీ కోర్సులో ఐదు సీట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ కోర్సుల్లో చేరేందుకు ఇంటర్ బైపీసీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. పూర్తి వివరాల కోసం 76809 45357, 91219 99654 ఫోన్ నెంబర్లులో గాని, శ్రీకాకుళం సమీపంలో రాగోలులో జెమ్స్ ఆసుపత్రిలో గల క్యాంపస్‌లో సంప్రదించాలని కోరారు.



నాగేశ్వరరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

మృతదేహాన్ని తెప్పించేందుకు చర్యలు

జామి, జనవరి 1: మండల కేంద్రమైన జామికి చెందిన కొత్తలి బంగారు నాయుడు దుబాయ్‌లో మరణించిన విషయం విదితమే. అతని మృతదేహాన్ని తెప్పించేందుకు ప్రయత్నిస్తామని శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు భరోసా ఇచ్చారు. బంగారునాయుడు మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు సహకరించాలని అతని భార్య ఎర్నమ్మ ఇప్పటికే కలెక్టర్, తహసీల్దార్‌లను కలిసినా స్పందన కనిపించలేదు. దీంతో జామి మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు ఈ విషయాన్ని శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్‌నాయుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడుకు వివరించారు. దీనిపై స్పందించిన ఎంపీ మాట్లాడుతూ దుబాయ్ ఇమ్మిగ్రేషన్ అధికారులతో చర్చించి మృతదేహాన్ని తెప్పించే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు.



రామ్మోహన్‌నాయుడుతో మాట్లాడుతున్న బండారు పెదబాబు

బహుజన రాజ్యం కోసం బ్యాలెట్ యుద్ధం

వేపాడ, జనవరి 1: బహుజన రాజ్యం కోసం బ్యాలెట్ యుద్ధం చేయాల్సిన అవసరం ఉందని వేపాడలో గల అంబేడ్కర్ విగ్రహం వద్ద మండల మాల మహానాడు, ఆంధ్రప్రదేశ్ దళిత కూలీ రైతు సంఘ నాయకులు, వేపాడ-వల్లంపూడి గ్రామాల దళిత బహుజనులు ప్రతిన బూనారు. భీమా కోరేగావ్ యుద్ధ స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకొని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల దళిత నాయకుడు దేబారిక కిరణ్ తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 50శాతానికి పైగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఓటర్లు ఏకతాటి పైకి వచ్చి రాజ్యాధికారం కోసం ముందడుగు వేయాలన్నారు. అగ్రవర్ణ పార్టీలు కల్పించే సంక్షేమ పథకాల మోసంలో పడడం కన్నా రాజ్యాధికారం కోసం పోరాడడం మంచిదన్నారు. దళితులంతా ఏకమై బ్యాలెట్ పోరాటం చేసేందుకు నడం బిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు మరియాదాస్, అప్పారావు ,బంగారయ్య, దువ్వాడ సత్యారావు, సుధాకర్, నరేంద్ర, ఛత్రపతి తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దళిత నాయకులు

ఘనంగా సింహాద్రి అప్పన్న ఉరేగింపు



శృంగవరపుకోట రూరల్, జనవరి 1: శృంగవరపుకోటలో సింహాద్రి అప్పన్న ఉరేగింపును భక్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. అప్పన్న మాలధారులు విశాఖ జిల్లా సింహాచలం పుణ్యక్షేత్రం నుంచి స్వామి వారి ఉత్సవ నమునా విగ్రహం తెచ్చి ఉరేగించారు. ఉరేగింపులో భాగంగా సింహాద్రి అప్పన్న వేషధారణలో ప్రజలను ఆకర్షించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను మొండివీధిలో ఉన్న గడ్డి గుడికి తీసుకెళ్లి పూజలు చేశారు. ఈ సంబరం సందర్భంగా పట్టణంలో సందడి నెలకొంది.

కార్టూన్‌కు రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి

బొబ్బిలి, జనవరి 1: పట్టణానికి చెందిన గుంట్రెడ్డి భాస్కరరావు (భాను) అనే రిటైర్డ్ టీచరు గీసిన కార్టూన్ రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతికి ఎంపికైంది. విజయవాడకు చెందిన గుల్లపల్లి అరుణకుమారి స్మారక సాహిత్య సంస్థ హాస్యానందం సౌజన్యంతో నిర్వహించిన కార్టూన్ల పోటీలో భాను మాస్టారు సంతాన సాఫల్యతా కేంద్రం-న్యూ టెక్నాలజీ అనే కోణంలో వ్యంగ్యంగా వేసిన కార్టూన్ ఎంపికైంది. ఈ నెల 26న విజయవాడలో జరగనున్న రిపబ్లిక్ దినోత్సవ వేడుకల్లో 3,500 రూపాయల నగదు బహుమతిని, ప్రశంసా పత్రాన్ని అందజేయనున్నారు. అనేక అవార్డులు అందుకున్న భానును పలువురు అభినందిస్తున్నారు.



బహుమతి పొందిన కార్టూన్, భాను మాస్టర్ (ఇన్‌సెట్‌లో)

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

- నిరసన కొనసాగిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

కలెక్టరేట్, జనవరి 1: సమాన పనికి సమాన వేతనం అందజేసి, ఉద్యోగ భద్రత కల్పించాలంటూ సమగ్ర శిక్ష ఉద్యోగులు సోమవారం కూడా నిరసన కొనసాగించారు. నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేసి.... సీఎం జగన్‌కు పోస్టుకార్డులు పంపించారు. దీంతో కలెక్టరేట్ ఆవరణ కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఏపీ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు బి.కాంతారావు మాట్లాడుతూ సమగ్ర శిక్షలో గత 20 ఏళ్లుగా పని చేస్తున్నామని, నేటికీ తమ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. తమ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి సమాన పనికి సమాన వేతనం అందజేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను అందజేయాలని, ప్రతి నెల ఒకటో తేదీకి జీతాలు అందజేయాలని కోరారు. నిరసన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 2న ఉరితాళ్లతో, 3న ఆర్‌డీవో కార్యాలయాల వద్ద ధర్నా, 4న కుటుంబ సభ్యులతో జిల్లా కేంద్రంలో మహా ర్యాలీ, 5న ఎస్‌పీడీ కార్యాలయ ముట్టడి, 6న బైక్ ర్యాలీ, 7న కుటుంబ సభ్యులతో నిరసన, 8న మంత్రుల ఇళ్ల ముట్టడి చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు గురువులు, రవీంద్రబాబు, కరుణాకర్, గోవింద, ఉమాశంకర్, శ్రీనివాసరావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నిరసన శిబిరంలో నినాదాలు చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

సగం కాలిన మృతదేహం

- బొడ్లపాడు సమీపంలో కలకలం

పాలకొండ (వీరఘట్టం): పాలకొండ మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పాసినబిల్లి అరవింద్ (24) మృతదేహం వీరఘట్టం మండలంలోని బొడ్లపాడు సమీపంలో దుస్తులు లేకుండా సగం కాలినట్లు గుర్తించారు. తొలుత మృతదేహాన్ని చూసిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకున్న కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో వారు అరవింద్ (24)గా గుర్తించారు. అరవింద్ సోమవారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు నిర్ధారించారు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

గరుగుబిల్లి, జనవరి 1: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి గరుగుబిల్లి ఎస్ఐ అమ్మన్నరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన రౌతు నాగేశ్వరరావు (35) గత కొన్నాళ్లుగా అనారోగ్య సమస్యలతో సతమత మవుతున్నాడు. సోమవారం ఉదయం అనారోగ్య సమస్యను భరించలేక గడ్డి మందు తాగాడు. దీనిని గుర్తించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన పార్వతీపురంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అక్కడ మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం కేంద్రాసుపత్రికి తరలించామని, మృతుడి తండ్రి కృష్ణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం

బొబ్బిలి, జనవరి 1: మద్యం మత్తులో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఏఎస్ఐ జి. భాస్కరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మెట్టవలస గ్రామానికి చెందిన దళాయి కృష్ణ స్థానిక గ్రోత్ సెంటరులోని ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలో కార్మికునిగా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన కృష్ణ సోమవారం ఉదయం బాగా మద్యం సేవించి ఆ మత్తులో మెట్టవలస కళ్లాల్లో పురుగుల మందు తాగాడు. అపస్మారకస్థితికి చేరుకున్న కృష్ణను గుర్తించిన స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం విజయనగరం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితుడి పరిస్థితి ప్రస్తుత్తం విషమంగా ఉందని, కృష్ణ భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ భాస్కరరావు తెలిపారు.

కుక్కల దాడిలో 15 గొర్రె పిల్లల మృతి

సాలూరు రూరల్, జనవరి 1: పొలంలో వేసిన గొర్రెల మందపై కుక్కలు దాడి చేసిన ఘటనలో 16 గొర్రె పిల్లలు మరణించినట్టు సాలూరుకు చెందిన బాధితుడు రండి అచ్యుతరావు సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. నెలిపర్తి పంచాయతీ పుల్లేరుగుడ్డివలస సమీప పొలంలో ఆదివారం రాత్రి మందవేశామని, ఆ సమయంలో వీధి కుక్కలు వచ్చి దాడి చేసి 16 గొర్రె పిల్లలను చంపేశాయన్నారు. తాము తేరుకునేలోపే గొర్రె పిల్లలు చనిపోవడంతో రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లిందన్నారు. ఈ విషయమై పశువైద్యులకు సమాచారం ఇచ్చామన్నారు. ● కుక్కల దాడిలో మరణించిన గొర్రె పిల్లలకు ప్రభుత్వం నష్టపరిహారమిచ్చి ఆదుకోవాలని సీపీఎం నేత ఈశ్వరరావు సోమవారం డిమాండ్ చేశారు. గతంలో గుమడాం వద్ద ఇదే విధంగా కుక్కల దాడిలో 23 గొర్రెలు మరణించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇలా జీవాలు మరణిస్తే కాపరులు ఏ విధంగా జీవిస్తారన్నారు. వీటికి వెంటనే పరిహారమివ్వాలని కోరారు.



మరణించిన గొర్రెలు

ద్విచక్రవాహనం ఢీకొని బాలుడికి గాయాలు

రాజాం రూరల్: మండలంలోని పొగిరిలో ఆదివారం రాత్రి ఓ ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన బాలుడు పొగిరి తరుణ్ కుమార్ గాయపడ్డాడు. ఎస్ఐ రవికిరణ్ కథనం మేరకు.. నూతన సంవత్సర వేడుకల్లో ఆదివారం రాత్రి పాల్గొని అనంతరం తరుణ్ కుమార్ నడచుకుని ఇంటికి వెళ్తున్నాడు. ఆ సమయంలో ఓ ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో తరుణ్‌కుమార్‌ను రాజాంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. తరుణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

నేటి నుంచి రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష

కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష 2వ విడత కార్యక్రమం మంగళవారం నుంచి ఆరు నెలల పాటు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి మండలంలో వారానికో శిబిరం జరుగుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మంగళ, శుక్రవారాల్లో పట్టణ ప్రాంతాల్లో బుధ, గురువారాల్లో జరుగుతుందని పేర్కొన్నారు. ఈ శిబిరాల్లో నలుగురు వైద్యుల బృందం ఉంటుందని, అందులో ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు ఉంటారని వెల్లడించారు. వెల్‌నెస్ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ కౌంటర్, హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 92 రకాల మందులు, పట్టణ ప్రాంతాల్లో 187 రకాల మందులు పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. ఈ శిబిరాలలో 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

మొండిగా వ్యవహరిస్తే సేవలన్నీ నిలిపివేస్తాం

- హెచ్చరించిన మున్సిపల్ కార్మికులు
- కొనసాగుతున్న సమ్మె



రాజాం రూరల్: వైఎస్ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న మునిసిపల్ కార్మికులు



బొబ్బిలి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా శిబిరంలో కార్మికుల నినాదాలు



నెలిమర్ల: కేక్ కట్‌చేసి వినూత్న రీతిలో నిరసన తెలుపుతున్న మునిసిపల్ వర్కర్లు

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె ఉధృతం

- 21వ రోజుకు చేరుకున్న అంగన్‌వాడీల సమ్మె
- శిబిరాల వద్ద నూతన సంవత్సర వేడుకలు
- ఆటపాటలతో నిరసన

తమ సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ యూనియన్ నాయకులు హెచ్చరించారు. తమ డిమాండ్ల సాధన కోసం జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె సోమవారంతో 21వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా శిబిరాల వద్ద వివిధ ఆటలు ఆడుతూ నిరసన తెలిపారు. పలు చోట్ల నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. తమ ఉద్యమానికి మద్దతు తెలపాలని గ్రామాల్లో చిన్నారుల తల్లిదండ్రులను కోరారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోతే సంక్రాంతి పండగను కుటుంబ సభ్యులతో కలిసి రోడ్డుపైనే చేసుకుంటామని ప్రభుత్వానికి హెచ్చరించారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరారు. ఇన్ని రోజులుగా సమ్మె చేపడుతున్నా ప్రభుత్వం తమను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి బృందం)


గజపతినగరం: కోలాటం ఆడుతున్న అంగన్‌వాడీలు


చీపురుపల్లిలో కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన


భోగాపురం: వినూత్నంగా నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీలు


భామిని: చిన్నారులకు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం


గరుగుబిల్లి: సమ్మె శిబిరంలో నూతన సంవత్సర వేడుకలు


పాలకొండ: బుక్కూరులో నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు


జామిలో మోకాళ్లపై నిరసన వ్యక్తంచేస్తున్న అంగన్‌వాడీలు


ఎస్.కోట: నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు


రామభద్రపురం: వేప కొమ్మలతో నిరసన తెలుపుతున్న దృశ్యం


కొత్తవలస: శిబిరంలో మాట్లాడుతున్న వెంకటనాయుడు


రాజాం రూరల్: ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


బొబ్బిలిలో ఆటపాటలతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

టీడీపీలో చేరిక


పొల్లంకి వాసులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేపీ నాయుడు

గంట్యాడ: పొల్లంకి గ్రామానికి చెందిన పలువురు మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు సమక్షంలో సోమవారం టీడీపీలో చేరారు. గ్రామంలోని వైసీపీకి చెందిన రావాడ చిన్న, ములగాడ సన్యాసప్పడు, ములగాడ అప్పారావు, వేచలపు లక్ష్మణలకు టీడీపీ కండువా వేసి, ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్ నాయుడు, కొప్పల వెలమ సాధకారిత కన్వీనర్ అల్లు విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో సుస్మిత ప్రతిభ


పతకాలతో సుస్మిత

నెల్లిమర్ల: అరుణాచలప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతున్న జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో కొండవెలగాడ గ్రామానికి చెందిన వల్లూరి సుస్మిత యూత్ విభాగంలో 55 కిలోల కేటగిరిలో పాల్గొని, బంగారు పతకం సాధించిందని కోచ్ చల్లా రాము తెలిపారు. ఆయన సోమవారం స్థానిక విలేకర్లకు ఈ విషయాన్ని వెల్లడించారు. సుస్మిత యూత్ విభాగంలో బంగా రు పతకంతో పాటు జూనియర్స్ విభాగంలో పాల్గొని, రజత పతకం సాధించిందని ఆయన తెలిపారు. ఈసందర్భంగా సుస్మితను కోచ్‌తో పాటు జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బెల్లాన లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, రాష్ట్ర అసోసియేషన్ ప్రతినిధులు లక్ష్మి, ధింసాబాబు, బడేటి వెంకటరామయ్య అభినందించారు.

అరాచకాలకు వీడ్కోలు

- మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు

చీపురుపల్లి: అరాచకాలు, హత్యలు, మానభంగాలు, పెచ్చుమీరిన అవినీతి కార్యక్రమాలకు రాష్ట్ర ప్రజలు డిసెంబరు 31తో ఆనందంగా వీడ్కోలు పలికారని మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు అన్నారు. సోమవారం ఆయన చీపురుపల్లిలో స్థానిక విలేకర్లతో మాట్లాడారు. గడచిన సంవత్సరమంతా రాష్ట్రం అరాచకాలు, విధ్వంసంతో అతలాకుతలం అయ్యిందన్నారు. ల్యాండ్, శాండ్, మైన్స్, వైన్స్ స్కాములతో నిండిపోయిందన్నారు. గంజి లేకపోయినా, గంజాయి మాత్రం విచ్చలవిడిగా దొరికిందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు బటన్ నొక్కుడు కార్యక్రమాన్ని బాగా అలవాటు చేశారని, రానున్న ఎన్నికల్లో ప్రజలు కూడా ప్రభుత్వానికి వ్యతిరేకంగా బటన్ నొక్కి తమ బాధ్యత నెరవేరుస్తారన్నారు. వచ్చే ఎన్నికల్లో తమ కుటుంబం నుంచి ఎవరో ఒకరూ చీపురుపల్లి, ఎచ్చెర్ల అసెంబ్లీ గానీ, పార్లమెంటు స్థానాలకు గానీ పోటీలో ఉంటారని తెలిపారు. ఏ పార్టీ తరపున పోటీ చేసేది ఇప్పట్లో చెప్పలేమని గద్దే తెలిపారు.

ఆలయ నిర్మాణానికి లక్ష విరాళం


విరాళాన్ని అందజేసున్న గరుగుబిల్లి గురుస్వామి

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీకనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయ సమీపంలో నిర్మాణంలో ఉన్న అయ్యప్ప ఆలయం కోసం గరుగుబిల్లి గురుస్వామి, చిట్టూరు శ్రీరామశర్మ రూ.1లక్షా 311 విరాళంగా అందజేశారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో గరుగుబిల్లి గురుస్వామిగా గుర్తింపు పొందిన శ్రీరామశర్మ సుమారు నాలుగు దశాబ్దాలుగా ప్రతి ఏటా అయ్యప్ప స్వామి దీక్ష కొనసాగిస్తున్నారు. తనకు గురుస్వామిగా వ్యవహరించిన కల్లికాటిల్ ప్రభాకర్ నాయర్ జ్ఞాపకార్థం అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి లక్ష రూపాయలు అందజేశారు. స్థానిక శివాలయంలో సోమవారం ఈ మొత్తాన్ని ఆలయ ట్రస్టు ప్రతినిధులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులుపాల్గొన్నారు.